పేరుకే క్రీడా ప్రాంగణాలు

- నిర్వహణ మర్చిన అధికారులు
- పరికరాలు లేక నిరుపయోగంగా మైదానాలు
- శివార్లలో ఉండటంతో కన్నెత్తి చూడని క్రీడాకారులు



నిరుపయోగంగా కుబీర్‌లోని క్రీడా ప్రాంగణం


రాజురాలోని క్రీడా ప్రాంగణం

కుబీర్: గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలు, యువకులకు వ్యాయామంతోపాటు క్రీడలపై ఆసక్తి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసింది. ఒక్కో క్రీడా మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టుల తోపాటు లాంగ్‌జంప్ పిట్, వ్యాయామం చేసేందుకు బార్ సింగిల్, డబుల్‌తోపాటు ఇతర సౌకర్యాలు కల్పించాలి. కానీ ఉపాధిహామీ నిధులతో ఏర్పాటు చేసిన క్రీడామైదానంలో పూర్తిస్థాయిలో వసతులు కల్పించకపోవడం, నిర్వహణను పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి.

కుబీర్ మండలంలో..

కుబీర్ మండలంలో 41 పంచాయతీలుండగా అనుబంధ గ్రామాలను కలుపుకొని 71 ఆవాస గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు. ఇందుకు కనిష్టంగా ఒక్కో మైదానం ఏర్పాటుకు రూ.33వేలు, గరిష్టంగా రూ.3.60లక్షలు ఒక్కో దానికి ఖర్చు చేశారు. వ్యాయామం చేసే బార్, ప్రాంగణ బోర్డు ఏర్పాటు చేస్తే రూ.33వేల నిధులు మంజూరవుతాయి. మైదానంలో కల్పించిన సౌకర్యాలను బట్టి రూ.3.60 లక్షల వరకు ఉపాధిహామీ నిధులను అధికారులు మంజూరు చేస్తారు.

అసంపూర్తిగా పరికరాలు..

మండలంలోని పలు గ్రామాల్లో పూర్తిస్థాయిలో పరికరాలను ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల బోర్డు, వ్యాయామం చేసే బార్ మాత్రమే ఏర్పాటు చేశారు. క్రీడాకోర్టులను ఏర్పాటు చేయలేదు. దీంతో ఇప్పటివరకు ఎక్కడా యువత ఆటలు ఆడినా దాఖలాలు లేవు.



మొల వాగులో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఇష్టానుసారం నిర్మించారు..

జిల్లా అధికారుల ఒత్తిడికి తలొగ్గిన సర్పంచ్‌లు.. గ్రామాల్లో ఇష్టానుసారం మైదానాలను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. జామ్‌గాం, కిషన్ నాయక్‌తండా, మొల గ్రామాల్లో ఊరికి కిలో మీటర్ దూరంలో ప్రాంగణాలను నిర్మించారు. మొల గ్రామంలోనైతే ఏకంగా వాగులో నిర్మించారు. ఎప్పుడు నీళ్లు పారుతూనే ఉంటాయి. ఇంకెప్పుడు ఆడతారని గ్రామస్తులు వాపో తున్నారు. సాయినగర్‌లో పాతశాల భవనాల నడుమ సందులో డబుల్‌బార్ ఏర్పాటు చేశారు. వర్ని, కస్రా నయాబాదిలో బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు.

ములుగుతున్న క్రీడా పరికరాలు..

పంచాయతీ నిధుల నుంచే స్పోర్ట్స్‌కిట్లను కొని సర్పంచ్‌లకు పంపిణీ చేశారు. ప్రస్తుతం అవీ పంచాయతీ కార్యాలయాల్లోనే ములుగుతున్నాయి. అధి కారులు స్పందించి క్రీడా ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించి యువత ఆటలు ఆడేలా, వ్యాయామం చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా మైదానం



గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు అధ్వానంగా ఉన్నాయి. మా ఊరిలో ఎక్సర్‌సైజ్ చేసే బార్, ప్రాంగణం బోర్డు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. అధికారులు స్పందించి మైదానంలో సౌకర్యాలు కల్పించాలి.

– సుంకరి సాయినాథ్, పార్డి(కె)

ఆడేందుకు రావడం లేదు



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మైదానంలో పరికరాలు కరువయ్యాయి. ప్రభుత్వం పంపిణీ చేసిన స్పోర్ట్స్ కిట్ సైతం పంచాయతీ కార్యాలయంలోనే ఉంది. దీంతో ఆడేందుకు ఎవరూ రావడం లేదు.

– నాగేందర్, కుబీర్

వినియోగించుకునేలా చర్యలు

ప్రస్తుతం అధికారులు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఎన్నికల తర్వాత గ్రామాల్లోని మైదానాలను పరిశీలించి.. సమస్యలు పరిష్కరిస్తాం. స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశాం. మైదానాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటాం. – లింబాద్రి, ఎంపీడీవో

అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

- ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందించాం
- త్వరలో జిల్లాకు ఐటీపార్కు తీసుకొస్తా
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి ప్రదాతలకే పట్టం కట్టాలని విజ్ఞప్తి


దిలావర్‌పూర్: గుండంపల్లిలో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

దిలావర్‌పూర్: ఎన్నికల వేళ మాయమాటలు చేప్పే వారిని నమ్మకుండా ప్రజాసంక్షేమం, అభివృద్ధికి పాటుపడే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నిర్మల్ అభ్యర్థి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు గుండంపల్లి, సముందర్‌పల్లి, కాండి, మాడేగాం, కదిలి, న్యూలోలం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గుండంపల్లి గ్రామంలో ఆయన మాట్లాడారు. మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అనేక పనులకు అడ్డుపడ్డాడన్నారు. గుండంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటులో అడ్డుపడితే తాను దగ్గరుండి మంజూరు చేయించానని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించామని..ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి ప్రదాతలకే పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే జిల్లాకు మెడికల్ కళాశాల తీసుకొచ్చామని.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఐటీపార్కు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వంటగ్యాస్ ధరలు తగ్గించి ప్రతీ కుటుంబానికి రూ.ఐదు లక్షల బీమా.. రూ.15లక్షల వరకు ఆరోగ్య బీమా అందిస్తామని పేర్కొన్నారు. మాడేగాం గ్రామంలో కల్యాణలక్ష్మి పొందిన ఆడబిడ్డలు మంత్రితో సెల్ఫీలు దిగారు. కదిలిలో ఆసరా పెన్షన్ పొందుతున్న వృద్ధురాలు మంత్రిని ఆశీర్వదించింది. కార్యక్రమంలో డాక్టర్ సుభాశ్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ కన్వీనర్ కె.దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర అనిల్, మాడేగాం సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ జాదవ్ మారుతి, న్యూలోలం సర్పంచ్ సవిత, పీఏసీఎస్ చైర్మన్ పి.వీ.రమణారెడ్డి, రైతుబంధు జిల్లా సభ్యుడు చిన్నారెడ్డి, కదిలి ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రావు, భుజంగ్‌రావు, సంభాజీరావు, సిర్గాపూర్ సర్పంచ్ గంగారెడ్డి, అడెల్లి ఆలయ డైరెక్టర్ సంద ముత్యం, ఆత్మ డైరెక్టర్ సప్పల రవి, ధని రవి, అనిల్, శ్రీనివాస్, చిన్నయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సోన్: న్యూబొప్పారంలో నాయకుల ప్రచారం

సోన్: మండలంలోని న్యూబొప్పారం న్యూవెల్మల్, జాఫ్రపూర్, సిద్ధులకుంట గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. న్యూవెల్మల్‌లో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా తిరుగుతూ గ్రామంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఆలయాలతోపాటు రూ.కోటితో సీసీ రోడ్లు, రూ.50 లక్షలతో డ్రెయినేజీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. జాఫ్రపూర్, సిద్ధులకుంట గ్రామాల్లో ఇంద్రకరణ్ రెడ్డి కోడలు దివ్యారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సోన్ మండలం గంజాల్ గ్రామానికి చెందిన 10 మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మోహినొద్దీన్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


నిర్మల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

మాజీ సర్పంచ్‌లు తోట సాయన్న, రాజేశ్వర్, రామారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయారెడ్డి, గౌతమ్‌రెడ్డి, కిరణ్‌రావు, నర్సయ్య, భూమేశ్, మహేందర్, మల్లయ్య, సురేశ్, హరీశ్ తదితరులున్నారు.

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఎమ్మెల్యేగా ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్ యాదవ్ జిల్లా కేంద్రంలోని బాలాజీవాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆకుల రామకృష్ణ, నెల్ల అరుణ్, కొప్పుల శ్రీధర్, గంధం సుధాకర్, జూల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: చేసిన అభివృద్ధిని చూసి ఇంద్రకరణ్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని డీసీసీబీ వైస్ చైర్మన్ ఎర్ర రఘునందన్ రెడ్డి ఓటర్లను కోరారు. మంగళవారం మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరాజు, రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో బీజేపీని ఆదరించండి

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లో బీజేపీని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిర్మల్ పట్టణం, మంజులాపూర్ బీఆర్‌ఎస్‌కు చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ పురస్తు రాజేశ్, ద్యాగ ప్రశాంత్ దిలావర్‌పూర్ మండలం కాల్వతండాకు చెందిన బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాదవ్ సీతారాం, సారంగాపూర్ మండలం ధని గ్రామ నాయకులు, మామడ మండలం న్యూ సాంగ్వి గ్రామ నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మామడ: బీఆర్‌ఎస్ అవినీతిలో పేరుకుపోయిందని.. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిర్మల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పొన్కల్, ఆదర్శనగర్, అనంతపేట్, పోతారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొండ్ర రాజారెడ్డి, నరేశ్, ముత్యం, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మామడ: పొన్కల్‌లో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

సోన్: మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఆ పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకుల్ నాగయ్య, అంకం జ్ఞానేశ్వర్, అంకం శ్రీనివాస్, సాగర్, దశరథ్, నవీన్, సాయన్న, దత్తు తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో మంగళవారం ఎంపీపీ అడ్వాల పద్మ బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు బీజేపీలో చేరగా వారికి ఎంపీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అడ్వాల రమేశ్, లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి, మల్లాపూర్ సర్పంచ్ రవి, కేశం లచ్చన్న, రంజిత్ పాల్గొన్నారు.


మల్లాపూర్‌లో కండువా కప్పుతున్న ఎంపీపీ పద్మ

నిర్మల్ ఎమ్మెల్యేగా మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యంరెడ్డి బీజేపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ మేనిఫెస్టో, కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. రంజిత్, శ్రీనివాస్, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా సినీనటుల ప్రచారం

జన్నారం: ఎన్నికల ప్రచారంలో భాగంగా సినీతారలు జన్నారం మండలానికి వచ్చి సందడి చేశారు. జాన్సన్‌నాయక్‌కు మద్దతుగా మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ తరుపున యజ్ఞం సినిమా విలన్ విజయ గంగరాజు, రియల్‌స్టార్ హీరో అప్సర్ అజాద్, నిర్మాత రాజశేఖర్, ఎన్నారై బాలరాజుగౌడ్‌లు ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం మండలానికి చెందిన పలువురు వైఎస్సార్ టీపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరగా జాన్సన్‌నాయక్ వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. మండలంలోని పొనకల్, కిష్టాపూర్, కలమడుగు గ్రామాల్లో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో మండలంలోని బీర్సాయిపేట, దంతన్‌పల్లి, శ్యాంపూర్, హస్నాపూర్ గ్రామాల్లో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్‌నాయక్ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువకులు, నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్రాభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందని కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. చారులత రాథోడ్, ధరణి రాజేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జన్నారం: ప్రచారంలో పాల్గొన్న సినీనటులు

ఖానాపూర్: యాదవుల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని.. ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. పట్టణంలోని యాదవ సంఘ భవనంలో కులస్తులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం యాదవులు విఠల్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

దస్తురాబాద్/ఖానాపూర్: జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని గోసంపల్లె, రాంపూర్, రేవోజీపేట, మున్యాల, గోడిసిర్యాల, దస్తురాబాద్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు.

‘గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటా’

మామడ: నిర్మల్ ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. మంగళవారం మండలంలోని గాయిద్‌పల్లి, తాండ్ర, గొండుగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమణారెడ్డి, అతిక్‌అహ్మద్, రఫీ, సంతోష్ ఉన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు అండగా ఉంటా


నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ బంధువులందరికీ అండగా ఉంటానని కాంగ్రెస్ అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ అమూల్యమైన పోస్టల్ బ్యాలెట్ ఓటును చేతి గుర్తుపై వేసి తనను గెలిపించాలని కోరారు.


మామడ: గాయిద్‌పల్లిలో శ్రీహరిరావు ప్రచారం


లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: ఎమ్మెల్యేగా శ్రీహరిరావును గెలిపించుకుందామని ఆయన అన్న కుమార్తె అర్పిత పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అట్ల రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, నగేశ్, రవి పాల్గొన్నారు.

దేశం, ధర్మం కోసం పోరాడాలి


ప్రచారం చేస్తున్న హిందూ వాహిని సభ్యులు

కుంటాల: దేశంలోని ప్రతీ పౌరుడు దేశం, ధర్మం కోసం పోరాడాలని హిందూవాహిని రాష్ట్ర ఉపాధ్యక్షుడు సరికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని లింబా(కె) గ్రామంలో మంగళవారం దేశ అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఓటు వేయాలని ఇంటింటా ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ ధర్మం తప్పకుండా నిజాయతీగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ప్రవీణ్‌కుమార్, హిందూవాహిని మండల కన్వీనర్ సిండె దిగంబర్‌పటేల్, సభ్యులు సాయి, అజయ్, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షతగాత్రుడికి ఆర్థికసాయం

లక్ష్మణచంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన సంగెం బద్దెన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు అతడిని ఇంటి వద్ద పరామర్శించి రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. బద్దెన్న తన టీవీఎస్ ఎక్సెల్‌పై నిర్మల్‌లో జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాశీర్వాద సభకు వెళ్తుండగా నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్ వద్ద కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన కాలు విరగడంతో ఆర్థికసాయం అందించారు. బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, లింగారెడ్డి, రమేశ్, నరహరి, నారాయణ తదితరులు ఉన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్


మామడలో ఫ్లాగ్ మార్చ్ చేస్తున్న పోలీసులు

మామడ: మండలంలోని మామడ, పొన్కల్, కొరిటికల్, అనంతపేట్, న్యూలింగంపెల్లి గ్రామాల్లో మంగళవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎన్నికల వేళ భయపడకుండా ధైర్యంగా ఓటు వేసేందుకు ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్నట్లు సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాష్టమి వేడుకలు

కుంటాల: మండల కేంద్రంలోని ప్రాచీన శ్రీకృష్ణ ఆలయంలో మంగళవారం ఘనంగా గోపాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గోసేవా ప్రముఖ్ కొత్త కాపు నారాయణ మాట్లాడుతూ గోవులంటే ప్రతి ఒక్కరూ గౌరవం పెంచుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ, సేంద్రియ వ్యవసాయంతోపాటు గోపోషణను ప్రోత్సహించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్చకుడు శ్రీకాంత్, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజలో పండితులు, భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీమద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ప్రారంభమైంది. పండితులు ప్రసాద్‌శాస్త్రి, హరీశ్‌కుమార్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞశాల ప్రవేశం, జ్యోతిప్రజ్వలన, గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, అగ్నిప్రతిష్ఠ, వాస్తుపూజ హోమాలు, కుంకుమార్చనలు చేపట్టారు.

ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న ముధోల్ సీఐ వినోద్


తానూరు: ప్రజల భద్రత కోసమే పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముధోల్ సీఐ వినోద్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్వి గ్రామంలో తెల్లవారుజామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ ఆధ్వర్యంలో నలుగురు ఎస్సైలు, 50 మంది పోలీస్ సిబ్బంది ఇళ్ల ముందు నిలిపిన వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. కిరాణదుకాణాల్లో తనిఖీ చేశారు. సరైన పత్రాల్లేని ఆరు ఆటోలు, నాలుగు ఫోర్ వీలర్లు, 86 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీఐ మాట్లాడుతూ వాహనాదారులు తప్పనిసరిగా అన్ని పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. ఎస్సై సందీప్, సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి వంతెన వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం ముధోల్ సీఐ వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని సీఐ సూచించారు. లోకేశ్వరం ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కుంటాల: మండలంలోని అర్లి(కే)61వ జాతీయ రహదారిపై మంగళవారం ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం, డబ్బు అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓటరు చీటీలు పంపిణీ


ఖానాపూర్‌లోని శివాజీ చౌరస్తాలో చీటీలు అందిస్తున్న బీఎల్‌వోలు

కుంటాల: ఈనెల 30న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌శాతం పెంచేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు చీటీలను పంపిణీ చేశారు. డీటీ నరేశ్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు చీటీలను పంపిణీ చేశారు. ఓటరు చీటీలతోపాటు సీ-విజిల్ పత్రాలను ఓటర్లకు అందించారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు జ్యోతిక, చంద్రకళ తదితరులున్నారు.

భగీరథ చెరువులోకి మిల్లు వ్యర్థాలు

- సుమారు ఐదు క్వింటాళ్ల చేపలు మృతి
- అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యకారుల ఆవేదన

లోకేశ్వరం: మండల కేంద్రంలోని భగీరథ చెరువులో ఐదు క్వింటాళ్ల చేపలు మృతి చెందడంతో రూ.యాభై వేల వరకు నష్టం వాటిల్లినట్లు మత్స్యకారులు తెలిపారు. మండలంలోని సేవాలాల్‌తండా ప్రాంతంలోని బాయిల్డ్ రైస్‌మిల్లు నుంచి వ్యర్థాలను ఒక్కసారిగా లోకేశ్వరం భగీరథ చెరువులోకి వదలడంతో నీరు కలుషితమై చేపలు మృతి చెందాయని మత్స్యకారులు పేర్కొన్నారు. మిల్లు నుంచి వ్యర్థాలు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

రాయపూర్‌కాండ్లీ, లోకేశ్వరం గ్రామాలకు చెందిన పశువులు కూడా ఈ చెరువు నీళ్లు తాగుతాయని.. వాటికి కూడా ప్రమాదం పొంచి ఉందని మత్స్యకారులు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఫోన్ అప్పగింత

నిర్మల్‌టౌన్: దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన వెల్మల అశోక్ మంగళవారం నిర్మల్ వచ్చాడు. నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్‌కు బైక్‌పై వెళ్తుండగా తన ఫోన్ కింద పడిపోయింది. వెనకాల వస్తున్న ఓ ఆటోడ్రైవర్‌కు ఆ ఫోన్ దొరికింది. అశోక్ చూసుకునేసరికి తన వద్ద ఫోన్ కనబడలేదు. వెంటనే బస్టాండ్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రవికి విషయం చెప్పాడు. సదరు కానిస్టేబుల్ ఆటో డ్రైవర్లను విచారించి ఫోన్ ఆచూకీ తెలుసుకున్నారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ చేతుల మీదుగా అశోక్‌కు ఫోన్‌ను అప్పగించారు. ఆ ఫోన్ విలువ రూ.25వేలని.. ఫోన్ కవర్‌లోనూ రూ.వెయ్యి ఉన్నట్లు ట్రాఫిక్ ఎస్సై వివరించారు.

‘తిరుపతి మృతి బాధాకరం’

కడెం: ఐఎఫ్‌టీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి తోకల తిరుపతి మృతి బాధాకరమని ఆ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సునారికారి రాజేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పేద కుటుంబంలో పుట్టి విద్యార్థి దశ నుంచి పీడీఎస్‌యూ నాయకుడిగా, న్యూడెమోక్రసీ నాయకుడిగా ప్రజాసమస్యలపై పోరాటం చేశారని పేర్కొన్నారు. ఇందులో జిల్లా కమిటీ సభ్యుడు దుర్గం లింగన్న తదితరులున్నారు.